# బొందలగడ్డ

ఆ ఊరు రోడ్డు పక్కమ్మటె వుంది. ఊరెమ్మటి ఓ పూడిపోయిన చెరువు. అందువల్లా ఈ మధ్య ఊరు చెరువువైపు పెరుగుతు వుంది. దట్టంగా పెరిగిన సర్కారు కంప చెట్ల మధ్య ఇండ్ల పై కప్పులు మాత్రమే కనిపిస్తూ వున్నాయి. కాస్త పైకి వున్న దేవుని గుడి శిఖరం, దాని రథశాల బాగానే కనిపిస్తున్నాయి. ఊరి చివరి ఇళ్ళ నుండి కింది బాగానా రోడ్డు వైపు పాతిక ఎకరాల ఖాళీ స్థలం వుంది. ఆ స్థలం చెరువు శిఖం. దానిని ఆలయానికి చెందేటట్టుగ ఆ మధ్య ఊరు తీర్మానించింది. అందువల్లా ఆలయాన్ని అంటి పెట్టుకుని వున్న పూజారులు ఆ భూమిలో కాలం అయితె శెనగలు, పెసళ్ళు పండించుకుంటు వస్తువున్నారు పశువులు, పక్షులు తినగా మిగిలిన వాటిని పూజారులు పోగుచేసుకుంటువున్నారు. ఎప్పటి నుండో నెయ్యి, ముద్దపప్పు తింటు వస్తున్నవాళ్ళకు రాను రాను నెయ్యి కరిగి పోయినా శిఖం వల్ల పప్పు గింజలకు పరవాలేదు.

ప్రభుత్వం దళితులకు ఇతర బలహీన వర్గాలకు ఇల్లు కట్టించడం భూములు కొని ఇవ్వడం చేస్తువున్న సంగతి అందర్కి తెలిసిందే. ఆ ఊరి దళితులకు కూడ పక్కా ఇళ్ళు కట్టించడానికి ఊరిచుట్టూరవున్న ఖాళి స్థల సేకరణ చేయవల్సి వుంది. ఒక వైపు రోడ్డే తరువాత దాన్ని దాటడం కష్టమౌతుంది. ఇంకో వైపు వరిపొలాలు, వెనకవైపు పెద్దవాగు, వర్షాకాలంలో ఆ వాగు ఓ సమస్య అయిపోతుంది. ఇక మిగిలింది చెరువు అడుగె ఊరి అంచున వుంది, దానిని ప్రతిపాదించడానికి గ్రామ కార్యదర్శిని కాలు ముందుకు కదపనివ్వటం లేదు. ఆ గ్రామ దళిత యువకుల ప్రయత్నం మీద యం.ఆర్.ఓ. వచ్చి చూసి వెళ్ళాడు. యం.ఆర్.ఓ. రాక గొర్రెల మందలో కర్ర విసిరినట్టయింది. గ్రామ కార్యదర్శి ఎప్పటికప్పుడు ఊళ్లో జరిగే సంగతులను ప్రభుత్వానికి చేరవేస్తూనేవున్నాడు

ఒక రోజు సాయంత్రం గుడిలో గంట 'గణగణ' మోగింది.

వర్షాకాలంలో ఉసిళ్ళు చేరినట్లు దళితులు మినహా ఊరి జనమంతా రామాలయం చేరారు. అందరు భక్తిగా కూర్చొని భజనచేసారు. హారతి పళ్లెంలోని కర్పూరపు మంటను చేతులతో తాకి కళ్ళకద్దుకోవడం ముగిసినంకా, ఆలయ పూజారి గర్భగుడివైపు దండం పెట్టి, ఎదురుగ కూర్చున్న జనంవైపు

మళ్ళీ-

"భక్తులారా ఈ కలికాలంలో కని విని సంఘటనలు తలెత్తుతున్నాయి. మనం జాగరూకతో గమనించి వాటిని ఎదురుకొనవలసివుంది. రామచంద్రప్రభు రాతిరి నా స్వప్నంలోకొచ్చి, ' ఊరికి అరిష్టం వచ్చింది తనను తన ఆస్తులను కాపాడమని కోరాడు'. అందుకే ఈ సభ ఏర్పాటు ఎవరిమటుకు వారు దేవుని గురించి ఆలోచించవల్సిందిగా కోరుతున్నాను". పూజారి అన్నాడు.

వొకరి ముఖాలు మరొకరు చూసుకుంటు కొందరు మధ్య మధ్య చెంపలేసుకుంటూ, అందరు ఆసక్తిగా వింటువున్నారు. మరొకవైపు స్త్రీలు బాల బాలికలు గర్భ గుడి ముందు నిలుచోని దండం పెట్టుకుని పోతువున్నారు.

"విశ్వకర్మలు, విజ్ఞతతో వ్యవరించవల్సివుంది. దైవసేవ చేసే చాకలి-మంగలి అందరు తమ వంతు పనులు తాను నిర్వహించవల్సివుంది". అనగానే సంబంధిత వ్యక్తుల్లో కొత్త శక్తి ఆవరించినట్టు అనిపించగ, మనదేవున్ని మనం కాపాడుకోవాలన్నట్టు చూస్తువున్నారు. గౌడ్లు, యాదవులు పూజారికంటె ముందె పూనకం వచ్చినట్లు ఊగిపోతువున్నారు. అది గమనించిన సర్పంచ్, 'అంత పైసల మహిమ' అనుకున్నాడు.

"మీరు భూములను అమ్ముకుంటువుంటె వాళ్లు కొంటున్నారు. బోరులు వేపయిస్తున్నారు. రెండు కారులు పండిస్తున్నారు. కొన్నాళ్ల తరువాత చూడండి ఉరికాముందు వాళ్లల్లోనుండె అవుతారు. ఎవరి దగ్గర పైసలుంటె వారి దగ్గరికే పదవి చేరుతుంది సుమా" అన్నాడు పూజారి సర్పంచ్ ముఖకవలికలను గమనిస్తు.

పూజారి ఎంతో నిగూఢంగా, మరెంతో లౌకికంగా గీతోపదేశం చేస్తుంటే అక్కడ చేరిన వారి నరాలలో ఏదో మత్తు ఎక్కుతువుంది.

"మనలను మన ఊరిని కాపాడుతున్న ఈ గుడిని, గుడి చుట్టు భూమిని మనం కాపాడుకోవాలి. గవర్నమెంటువాళ్లు ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలనుంటువున్నారట. దానిని ఊరంతా కలసి కట్టుగ ఎదిరించవల్సి వుంది. అందుకు సిద్ధం కావాల్సిందిగ దైవాజ్ఞ" అంటు ముగించాడు. అరవై ఏళ్ల అర్థ నగ్నపు పూజారి బుజం నుండి జారుతున్న ఉత్తరీయాన్ని యదాస్థానంలోకి సర్దుకుంటూ.

"అట్లా జరగడానికి వీలులేదు" అన్నాడు మల్లన్న గౌడు.

"అది జరిగే పనే కాదు" అన్నాడు బీరప్ప యాదవ్.

వాళ్లిద్దరి వైపు పూజారి అభినందనీయముగా చూస్తూ 'అసలు వ్యక్తులకు చురుకంటుకుంది చాలు ఇంక లంకాదహనం కావల్సిందె' అని లోలోన అనుకుంటు వాళ్ళ వైపు ఆశీర్వదించినట్లు చూసాడు.

'అందరు శ్రమించి సంపాదిస్తె వీళ్ళు నీళ్లతో సంపాదిస్తున్నారు. ఏదైనా జరగకూడనిది జరిగితె ఎదురు తిరిగి శక్తే వీళ్లకే వుంది మరి'. అని అనుకుంటూ కుడి చేతివేలితో కింది పెదిమను రాసుకున్నాడు.

'ఊరి మీది ఉట్టి పుణ్యానికి సంపాదించేది ఎంతైనా ఖర్చు పెట్టగలరు. హుకానీయండి దైవం మీ వైపె వుంటుంది'. అంటు చెయ్యెత్తి ఆశీర్వదించాడు పూజారి. రొమ్ము విరుచుకుంటు అక్కడి నుండి కదిలారు భీరప్ప యాదవ్, మల్లన్న గౌడు. వాళ్లను చూసి మిగతావాళ్లు కూడ తమ నడకలో కొంత మార్పు తెచ్చుకున్నారు. "మన దేవున్ని మనం కాపాడుకోకపోతె ఎట్లా" అనుకున్నారు తమలో తాము

0 0 0

కందిరీగ తెట్టెను కదిలించినట్టయింది. ఆ రోజు నుండి దళిత వాడవైపు కన్నెర్ర చేసి చూస్తు వున్నారు ఇతర కులాలవాళ్లు. దళితులంతా ఆఫీసులు తిరుగుతునే వున్నారు. 'తమకు ఇండ్ల స్థలం ఇప్పించమని' అర్జీలు పెడుతునె వున్నారు. యం.ఆర్.ఓ. చెరువు పక్క భూమి తప్ప దగ్గరలో మరో ఖాళి భూమి లేదని నివేదిక పంపాడు. మిగతా రెవిన్యూ ఉన్నతాధికారులంతా వచ్చి 'అవును' అంటు వెళుతువున్నారు. 'ఆ భూమిని సేకరించక తప్పదు' అని కూడ అనిపోతున్నారు.

మాకు ఇండ్ల స్థలాలు తప్పక కావాలని దళితులు కోరుతు, 'ఒకప్పుడు గుడిసెకిద్దరం, మొగుడు పెళ్లాం ఉండేటోల్లం. ఇప్పుడు పిల్లా పాపలతో కొడుకు కోడండ్లతో ఇంటికి పది మందిమై, పందులకు మాకు తేడా లేకుంద వుంటున్నం, అందుకే మాకు ఇండ్లు కావాలి. కనుక తమరు ఓ నిర్ణయం తీసుకోండి. ఇండ్ల భూమిని పంచండి'. అని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఆ భూమిని 'ఇవ్వడానికి వీలులేదని' ఊరి జనం, అది తప్ప వేరే భూమి లేదని దళితులు ఎవరి వాదన వారు చేస్తూనే వున్నారు.

ఈ సారి వినాయకచవితి పండుగకు పెద్ద విగ్రహాన్ని ట్రాక్టర్లో తెచ్చి నడి ఊళ్ళో ప్రతిష్టించారు. రోజు అర్ధరాత్రి వరకు భక్తి పాటలతో ఊరంతా

అదరకొడుతువున్నారు. మిగతా కులాలందరు భక్తితో భజనలు చేస్తూనే వున్నారు. వారం రోజులు దళితులు మాత్రం ఆ దరిదాపుల్లోకి రాలేదు. గ్రామ పెద్దలు ఏదో ఓ కారణంగా దళితులను బెదిరిస్తె తమ ప్రయత్నాలను మానుకుంటారన్న ఉద్దేశంతో ఎదిరి చూస్తువున్నారు.

వాళ్ళు పసిరికా పాముల్లాంటి వాళ్లు తమ వాడల్లో తాము మామూలుగా వుంటు వస్తున్నారు. వాళ్ళకు తెలుసు ఊరొక్కటైతే తాము నిలవలేమని నిలవాలంటె ఘర్షణకు దిగాలని, ఘర్షణకు దిగితే చాకిరి కులాలు, బహుజనులు నినాదాల వరకే కాని తమవైపు నిలవరని, పోగ వాళ్ళే తమపై ముందుగ దాడి చేస్తారని ఘర్షణ ఎవరికి క్షేమం కాదనుకుంటు వస్తువున్నారు.

ప్రభుత్వం ఊరి ప్రక్కమ్మటి భూమిని స్వాదీనం చేసుకుని దళితులకు పంచాలని నిర్ణయించింది. ఆ మేరకు ఓ పత్రికలో ఓ ప్రకటన కూడ వచ్చింది. ఆ వార్త చూసిన ఊరి అగ్రవర్ణం వాళ్లు చిర్రెత్తి పోతున్నారు. శూద్ర కులాల వాళ్ళను దళితులపై ఉసిగొలిపి తగాదాలు పెడుతువున్నారు. చేను దగ్గర, గెట్టు దగ్గర 'అమీ-తుమీ' అనుకుంటూనే వున్నారు. మీకే కావాలనా ఇండ్లు అని మంగలి అంటున్నాడు. వున్న ఇండ్లు చాలవా అని చాకలి అంటున్నాడు.

మరునాడు వినాయకుని నిమజ్జనం. తమకు ఇళ్ల భూమిని ఇవ్వనివ్వటంలేదని తెలుసుకున్న దళితులు, నిమజ్జనం ఊరేగింపుకు డప్పులు కొట్టడానికి రాలేదు. అది గ్రహించిన గ్రామ పెద్దలు పక్క ఊరినుండి సన్నాయి మేళాన్ని తెప్పించుకొని ఊరేగింపు మొదలు పెట్టారు. మొదట సజావుగానే సాగింది. తలలకు కాషాయపు రంగు గడ్డలు కట్టుకొని యువకులు ఊగిపోతు గంతులేస్తు వున్నారు. మెల్లగా సాగుతుంది ఊరేగింపు. ఊరి చివరి దళితవాడకు వచ్చేసరికి కలకలం మొదలైంది.

"డప్పు ఎందుకు కొడతలేరని" అని నిలదీస్తె.

"అది మా యిష్టం" అన్నారు అంతే స్థాయిలో దళితులు.

"ఊరన్నప్పుడు ఎవరు చేసే పనులు వాళ్లు చేయాలికద" అన్నాడు సరపంచ్. దళితులు ఎన్నికలపుడు ఏడు చెర్ల నీళ్ళు తాగింది గుర్తుకొచ్చింది సర్పంచ్‌కు.

"మరి ఊరన్నాక అందర్కి ఇండ్లూ ఉండాలికద" అని అడిగారు దళితులు.

"సరె వాటికోసం అందరం ప్రయత్నం చేస్తాం గద అన్నాడు పై మాటకు సర్పంచ్.

ఇరు పక్షాలలో ద్వేషం రగులుకుంది. అంతే మనుషులు గోడ్రై పొట్లైనారు. రక్తం చిందింది. పోలీసులు వచ్చి దళితులను తరిమి తరిమి కొట్టారు. యాదవ్‌కు నచ్చ చెప్పారు. గౌడ్‌ను కాకపట్టి మొత్తం మీద వినాయకుడున్న ట్రాక్టరును రోడ్డెక్కించారు. అది రాచకాలువ వైపు మళ్లింది. బాగా తాగి వున్న ఓ యువకుడు పట్టు తప్పి జారికింద పడగ పక్కటెముకలు విరిగి కుప్పకూలిపోయాడు. ఆ తరువాత ఆయన్ను అదే ట్రాక్టర్లో దవాఖానకు తీసుకెళ్లారు. మైకం మనిషిని నిర్వీర్యం చేస్తుంది.

0 0 0

'ఆ రాత్రి గుడిలో రామాయణగాథ పఠనం జరుగుతూ వుంది. రాముడు చాటుగ వాలిని వదించాడు. ఆ తరువాత హనుమాన్‌ను రామునికి తోడుగ పంపాడు సుగ్రీవుడు. హనుమాన్ లంక చేరుతాడు! లంకేయులు తోకకు నిప్పంటిస్తారు. మండే తోకతో లంకంతా గంతులు వేస్తాడు. లంకకు నిప్పంటుకుంటుంది'. సరిగ్గా అదే సమయాన దళితవాడలో మంటలు లేచాయి. నిద్రలో వున్న జనం తేరుకుని కుండలందుకుని చల్లార్చుకున్నారు. "ఎవరు పెట్టారు ఈ నిప్పు?" అని రాత్రంతా ఆలోచిస్తు కూర్చున్నారు. ఆ రాత్రి ఆ వాడకు నిద్రలేదు.

గ్రామ కార్యదర్శి రిపోర్టును అందుకుని–

"ఎట్లా తగులబడ్డయి" పోలీసులు ఆరా.

" రాత్రి అందరం రామాయణం వింటు గుళ్లోనే వున్నాం". అన్నారు ఊరివాళ్ళు.

"సరిగ్గా లంకాదహనం జరిగెటపుడే అక్కడ మంటలు లేచాయట"!

"అవునట" అన్నారు గ్రామస్తులు.

"లంకలో హనుమంతుడు నిప్పు పెట్టాడు, మరి ఇక్కడా"? అడిగారు పోలీసులు.

"ఇక్కడ ఆయనే పెట్టి వుండవచ్చు" అన్నాడు పూజారి.

"ఏం మాట్లాడుతున్నావయ్యా" పోలీసు దబాయించాడు.

"ఎక్కడ పాపం పెరిగితే అక్కడ" అంటూ ఆగిపోయాడు.

ఇంతలోనే "నాకు తెలుసు" అన్నాడో వ్యక్తి, తన పేరు దాసని, నిజంగా మధ్యానికి దాసుడైనాడు. అతను తాగిన మైకంలో వున్నాడు. ముఖం ఉడికిన

వంకాయ లాగుంది. కాళ్లు భూమ్మీద నిలవడం లేదు. కనురెప్పలను అతి కష్టంగా కదిలిస్తున్నాడు.

"చెప్పు చూస్తె చెప్పు" గద్దించాడు ఎడ్‌కానిస్టేబుల్ ఓ చేతిలోని లాఠిని మరోచేతిలోకి తీసుకుంటు

"చెప్పుత చెప్పుత" అంటూ ఓ సారి చుట్టు చూసి, ముందుకు తూలి నేలను చూస్తు మునివేళ్ళతో భూమిని తొక్కిపడుతు.

"దానికోసమే" అంటు చేతులు జోడించాడు. అప్పుడతని మూతి మూడు వంకర్లు పోతు వుంది.

"దేనికోసం" అంటు తీక్షణంగా చూశాడు. ఎడ్.

చుట్టు వున్నవాళ్ళంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. 'ఏం చెపుతాడో, ఎవరిమీద చెపుతాడో' పిచ్చివాని చేతిలో రాయి తాగిన వాని నోటిలోని మాట ఎవరిమీద పడుతుందో వూహించడం కష్టం అనుకుంటు

ఎడ్‌కు వచ్చే కోపాన్ని ఆపుకుంటు "చెప్పర బాబు చెప్పు" కాస్త బతిమిలాడినట్టు అన్నాడు.

"చెబుతనన్నవ్ చెప్పు లేకపోతె బొక్కలోకి పోతావ్" అన్నాడు పక్కన్నే నిలుచున్నపోలీసు.

ఒక్కసారె తల ఇటు ఇటు తిప్పి "అదె సారకోసం" అన్నాడు.

"అక్కడ సారా?" అని ఎడ్ ఆశ్చర్యంగా చూశాడు.

"తెలియదా. అక్కడ సార అమ్ముతరు. నేను రాతిరినుండి అక్కడే తాగుతువున్న" అన్నాడు దాసు.

"ఎవరి కాచిన సారా" అన్నాడు ఎడ్ ఈసారి ప్రాదేయపడ్డట్టు.

"అదెసార్ మీకు తెలియంది నాకు తెల్సింది. వాళ్లు దొంగసార కాస్తున్నరు సార్" పడబోయి నిలతొక్కుకుంటు అన్నాడు దాసు.

చుట్టు వున్న వాళ్లు అప్పటివరకు బిగపట్టిన ఊపిరిని ఒక్కసారె వదిలారు.

"చూపిద్దువు పద" అంటు అతన్ని లాఠితో నెట్టాడు. అతను కదిలి ఎడ్ వైపు బిత్తరగ చూసాడు. "ఏం బుర్రర నీది పోలీసును మించిన బుర్ర. ఎవర్రనీకీ ఐడియా ఇచ్చింది". అని అడిగాడు నవ్వుతు.

"ముందు ఈ ఫిర్యాదు రాసుకోండి" అంటు ఆగాడు.

"అతను చెపుతున్నాడుగ రాసుకుండి" అని జనం అనగానె పోలీసులు

అన్న వాళ్ళ వైపు చూసారు.

"తాగిన వాడు ఎపుడు తప్పు చెప్పడు సార్" అన్నాడు ఇంకో వ్యక్తి.

"అట్లనా సరె" అంటు ఓ ఇంటి అరుగుమీద కూర్చోని రాసుకోసాగాడు ఎడ్ చుట్టూర జనం.

దళితవాడలో దొంగసార కాస్తున్నప్పుడు అదుపు తప్పిన మంటలు గుడిసెను అంటుకున్నట్టు, అట్లాగె ఆ పక్క ఇండ్లకు అంటుకున్నట్టు సార కాయడానికి వాడె కుండలు, గురుగులు మైసమ్మ గుడి దగ్గర దొరికినట్టు పోలీసులు కేసు రాసుకున్నారు. అంతేకాదు అనుమానం వచ్చినవాళ్లను పట్టుకెళ్లారు. 'సార తాగేది వాస్తవమే కాని సార కాచేది తాము కాదన్న విషయం ఆ దేవునికి మాత్రం తెలియదా అంటు గుడివైపు అమాయకంగా చూసారు. గుడిలోని దేవుడు నమ్మాడో లేదో తెలియదు కాని పోలీసులు నమ్మడానికి సాక్ష్యం వుందికదా!

దాసు చెప్పనైతె చెప్పాడు కాని ఆ తరువాత కడుపులో బుగులు మొదలయింది. దాసు పటేలు ఇంటికి వెళ్ళి "పటేలా నేను నిజమె చెప్పిన గద" అన్నాడు రెండు చేతులు జోడించి.

గుడి దగ్గర పూజారికి ఎదురుపోయి "నేను నిజమె చెప్పినగద అయ్యగారు" అన్నాడు తూలుతు చెంపలేసుకుంటు.

భీరప్ప యాదవ్ బావి దగ్గరికి పోయి నేను ఉన్నది ఉన్నట్టు చెప్పితిగ" అన్నాడు.

మల్లన్న గౌడ్ వాకిట్లో నిలుచొని లోపలికి తొంగి చూస్తూ" సార కాసేది నీవె కదా. అగో ఆ పాడు బడ్డ ఇంట్లనె కదా నీవు బట్టీలు పెట్టేది వాళ్ళు కాస్తున్నారని అబద్దాలు చెప్పిస్తివి, నీవు, యాదవ్ చెప్పినట్టే నేను చెపితి" అన్నాడు మళ్ళీ తానే.

"అవన్నీ నీకెందుకుర నీకు పావు కావాలంతేగ" అంటు లోపలికి చూస్తు ఏదో సైగ చేసాడు. ఓ వ్యక్తి గ్లాసులో సార తెచ్చి దాసుకిచ్చాడు. దాసు ఒక్క గుటుకలో దానిని మింగేసి ముఖాన్ని చిట్లిస్తు మూతిని తుడ్చుకున్నాడు.

"అయితె నేను ఆయల్ల పోలీసులతో నిజమె చెప్పిన" అనగానె నిజమే చెప్పినవో అబద్ధమే చెప్పినవో ఆయె-పాయె ఆసంగతులు ఇప్పుడెందుకు? నీవు ఇట్లనే వర్రుతు వుంటె అసలు సంగతి అల్లకు తెలిసేనా నీ పని అయితది. నోరు మూస్కోని పో" అని గద్దించాడు గౌడ్.

"ఛీ నోరంతా కంపువాసన. నా కొడుకు కల్తి చేసినట్టుంది" అనుకుంటు దాసు నోరు మూసుకుని అక్కడి నుండి కదిలాడు.

చాలా రోజుల వరకు దళితులు పోలీసు స్టేషన్ చుట్టు తిరిగారు. కోళ్లను మేకలను అమ్ముకోక తప్పలేదు. వట్టిగ వచ్చిన జబ్బు డబ్బు ఖర్చు పెట్టించిపోయినట్టు తప్పుడు కేసైనా ఖర్చులు తప్పలేదు. కేసుకుపోతే కూలిపోయి అప్పులాయె అంటు అంగలార్చారు" 'పేదోల్లకో దేవుడు పెద్దల్లోకో దేవుడా'? అనుకుంటు తమకు కలిగిన బాదను దిగమింగారు.

0 0 0

ఊళ్లో ఈ ఇండ్ల భూమి సమస్య పెద్ద చిచ్చేలేపింది. దళితులను చూసి మిగతా కులాల వాళ్లు మిగతా కులాల వాళ్ళను చూసి దళితులు ముఖాలు తిప్పుకోవడం, కోపతాపాలు ప్రదర్శించుకోవడం జరుగుతూ వుంది. ప్రభుత్వ అధికారులు ఆ భూమిని ఎలాగైన ఇళ్ల స్థలాలకింద తీసుకోవాలన్న నిర్ణయం జరిగింది. అది ఊరివాళ్లకు మింగుడు పడడంలేదు. ఎత్తుకు పై ఎత్తు ఆలోచిస్తున్నారు.

ఆ రోజు రాత్రి గుడిలో రామాయణం కథ ముగిసింది అని ప్రకటించారు. భక్తులలోనుండి ఒకరు లేచి "దేవుడైన రాముడు మామూలు మనిషి అయిన శంభూకుని శిరస్సు ఖండించకూడదు కదా?" అని అడిగాడు.

"అది'అంతే వాడు గత జన్మలో చేసుకున్న కర్మవల్లా" అంటూ కూర్చొమ్మని చేత్తో సైగ చేశాడు కథకుడు.

ఊరి చావట్లో గొడవ మొదలైంది. చావడి దగ్గరి నుండి వెలుతున్న ఓ దళిత యువకున్ని ఆపి కొట్టారట. అతను తమ వాడకు వెళ్లి అందర్కి తన తలకు అయిన గాయాన్ని కారుతున్న రక్తాన్ని చూపించాడు. అది చూసిన జనం కత్తులు, 'గొడ్డండ్లు' కర్రలందుకుని చావడికి చేరుకున్నారు. ఇరు పక్షాలు ఒకరికొకరు ఎదురై అమి తుమి అనుకున్నారట శర్మా గారు" అంటు గుడిలోకి వస్తు అన్నాడు సరపంచ్.

"మన యాదవ్‌కు ఇశార చేస్తే చాలు" అన్నాడు మళ్ళీ తానె.

"మన వాళ్ళెవరు జైల్ పాలుకాకుంట కార్యక్రమం నడపాలి". అన్నాడు శర్మ.

"అంటె"

"చూస్తారు కద" అన్నాడు శర్మ. కాని పరిస్థితి ఎవరి చేతుల్లో లేకుండా

మారిపోయింది.

జనం ఉరుకు-పరుగులకు వీధుల్లోని కుక్కలు భయం భయంగా అరుస్తూ సందుల్లోకి పరుగెత్తుతున్నాయి.

పరిస్థితిని గమనించిన కొందరు ఇళ్లల్లో జొరబడి తలుపులు బిగించుకున్నారు. ఇంట్లో జొరపడడానికి పరుగెత్తె ఓ వ్యక్తిమీద గొడ్డలి వేటుపడింది. అతను మొదలు నరికిన చెట్టులాగ నేలకొరిగాడు. అది చూసిన జనం పరుగెపరుగు. ఒక మనిషి నేలకొరిగినట్టు గుడి దగ్గరికి వార్త చేరింది. భజన బందుచేసి సందుల్లో నుండి గొందుల్లో నుండి అందరు తమ తమ ఇండ్లకు చేరుతు ఉన్నారు. చావట్లో పడి ఉన్నది ఎవరైంది చూసే దిక్కులేదు. ఎవరి భయం వారిది. తెలిసిన వాళ్ళు ఎదురైనా తేరిపార చూస్తు తప్పుకొని వెళుతూ వున్నారు.

రామాయణంలో శంభూకున్ని రాముడు చంపిన విషయ ప్రస్తావన చెపుతున్నప్పుడే వూళ్లో మరో తల తెగిపడిందే! ఎవరు చంపినట్టు?

"చచ్చిపడి ఉన్నది శూద్రుడే!"

దళితులు చంపారా?

"కాదు"

"మరీ"

"వాని గత జన్మకర్మ ఫలం"

"చంపిందెవరు"

"వాళ్లె చంపుకున్నరు. వాళ్లె చంపి ఆ కేసు దళితుల మీద మోపి, వాళ్లను నానా బాదలు పెడదామని వాళ్ల వ్యక్తిని వాళ్లె చంపుకున్నారని ఎందుకు అనుకోకూడదు" అన్నాడు గ్రామ కార్యదర్శి" గ్రామ రాజకీయాలు ఎట్లా వుంటాయో? ఎవర్ని ఎవరు ఎట్లా ఇరికిస్తారో ఆయనకు బాగా తెలుసు! "కాదు వాళ్లకు వ్యతిరేక సాక్ష్యం చెప్పాడుగా వాళ్లె చంపొచ్చు" అన్నాడు గ్రామ పెద్ద. "మొత్తం మీద ఎవరో ఒకరు చంపారు. ఈ ఊళ్లో హత్య జరిగిందని ముందు పోలీసులకు తెలియపరచాలి" అంటు కదిలాడు గ్రామకార్యదర్శి.

'మొన్న రామాయణం కథ గుడిలో చెప్పిన్నాడు లంకాదహనం జరిగిన గట్టమప్పుడు దళితవాడ తగలబడ్డది. రాత్రి శంభూకుని తల నర్కిన సంఘటన వివరణపుడు చావట్లో ఓ మనిషి తల తెగింది. ఏంటబ్బా అంటు' ఆలోచిస్తూ

గ్రామకార్యదర్శి అదే విషయాన్ని పోలీసులకు తెలియపరచాడు.

తెల్లవారంగా పోలీసు జీపు రానెవచ్చింది. వెంట కుక్కను తెచ్చారు. చావట్లో చచ్చిపడి వున్నది మొన్న సాక్ష్యమిచ్చిన దాసు. ఊరంతా ఉడికిపోతుంది. పరిస్థితిని గమనించిన పోలీసులు 144 సెక్షన్ విధించారు. మనుషుల కదలికల మీద నిఘా వుంచారు. కుక్క దాని పని అది చేస్తూనే వుంది.

"మొన్న వాళ్ళకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు ఈ పని వాళ్లే చేశారు." అని గ్రామ పెద్దలు చెప్పారు.

"మేమెవరిని చంపలేదని" దళితులన్నారు.

కుక్క దళితవాడ వైపు పోనేలేదు. అది చావడినుండి చక్కగ గుడివైపు నడిచింది. వెంట పోలీసులు, ఆ వెనకా జనం ఆసక్తి కనపరుస్తు నడుస్తు వున్నారు.

కుక్క గుడి ఆవరణలోకి వెళ్లింది.

"ఆ నరికి చంపిన ఆయుదాన్ని గుడిలోకి విసిరేసి ఆ కేసు గుడి వాళ్ల వైపు పడాలని ఇట్లా చేసి వుంటరు"అని పూజారి పోలీసు ఆఫీసర్‌తో అన్నాడు. అది విన్న పోలీసు ఆఫీసర్ నొదురు చిట్లిస్తూ చూసాడు.

గ్రామ పెద్దలు "అంతెకదా, వుండొచ్చు లేకపోతె మా మనిషిని మేమే చంపుకుంటమా!?" అన్నారు.

కుక్క ఆవరణ దాటి, ధ్వజస్థంభాన్ని దాటి గర్భగుడిలోకి వెలుతుంది.

పూజారి నోట్లో తడి ఆరిపోయింది.

గ్రామపెద్దలలో వనుకు పుట్టింది.

పోలీసు ఆఫీసర్ వెనక్కు మళ్లి "గుడి గేటును మూసేయండి. ఎవరు బయటికి వెళ్లొద్దు" అన్నాడు.

పూజారికి మాత్రం మనస్సులో భశ్మాసురుడు మెదలగ ఓ సారి ఎదను అదిముకుని వదిలాడు. కళ్లు మూసి రామున్ని తలచుకుని చెంపలేసుకున్నాడు. వెంటనే పోలీసులు గేటు మూసేసి, కాపలవున్నారు.

కుక్క గర్భగుడిలోకి వెళ్లింది.

అందరు అవాక్కై చూస్తు వున్నారు.

సీతారాముల విగ్రహాల వెనక వున్న ఎండిన రక్తపు మరకలతో వుత్తరీయంలో చుట్టి వున్న గండ్ర గొడ్డలిని నోటితో పట్టుకొచ్చి పోలీసు ఆఫీసర్

ముందుంచుంది. జనంలోని ఎవరో ఒకరు గుడిగంట కొట్టారు. జనం పూజారి వైపు చూస్తు వున్నారు. జనంలోనుండి ఎవరో "అంత కర్మఫలం" అన్నారు. అందరు అతని వైపు ఎవరా అని చూసారు. అతను ఎవరో కాదు రాత్రి 'రాముడు శంభూకుని ఎందుకు చంపినట్టు?' అని ప్రశ్నించిన వ్యక్తే!

"రామచంద్ర ప్రభో ఇంతటి పాపం నేను చేయగలనా" అని అరిచాడు పూజారి జనం ఒక్కసారె అటు చూసారు.

కుక్క బయటికి నడిచింది. జనం దాని వెనకాలె నడుస్తూ వున్నారు. అది నడి వీధిలో నుండి పరుగెత్తి ఓ ఇంటి ముందాగింది.

"ఆ ఇల్లు ఎవరిది" అని అడిగాడు పోలీస్ ఆఫీసర్.

"మల్లన్నయాదవ్‌ది" అన్నాడు గ్రామ కార్యదర్శి.

"పిలవండి" అన్నాడు పోలీసు ఆఫీసర్.

"లేదు బాయికాడికి బోయిండు" అంది ఆయన భార్య

పోలీసు కుక్క మల్లన్న యాదవ్ బావి వైపు నడిచింది. దాని వెనకాల పోలీసులు, వాళ్ళ వెనకాల గుంపులు గుంపులుగా జనం.

0 0 0

పోస్టుమార్టం తరువాత శవాన్ని తిరిగి ఊరికి తీసుకొచ్చారు. రాత్రి పొద్దుపోయినంకా బొందపెట్టారు.

తెల్లారి చూస్తె ఎక్కడ పెట్టారు బొంద?

అదే ఇళ్ల స్థలం కోసం కేటాయించిన భూమి మధ్య!

ఆ భూమి ఇప్పుడు బొందలగడ్డ!

సెప్టెంబరు, 2003.